శ్రీ చందు సుబ్బారావు

చీలిక

అనుకోకుండా కలుసుకున్నందుకు ప్రకాశరావుగారు మహదానందం చెందారు. గుంటూరు వెళ్ళి చాలా రోజులైందేమో, అయన్నీ మధ్య కలుసుకోనేలేదు.

ప్రకాశరావుగారు స్నేహశీలి. ఆయనంటే నాకెంతో గౌరవం. ఆ ఊళ్ళోనే ఓ కాలేజీలో సీనియర్ ఇంగ్లీషు లెక్చరర్‌గా పని చేస్తున్నారు. లెక్చరర్ అంటే కేవలం ఆ పూటకు ముక్కున పెట్టుకుని చీదే ఉపన్యాసకుడుకాదు. క్షుణ్ణంగా చదివినవాడు. గంటల తరబడి ఓ విషయం గూర్చి విడమర్చి చెప్పగల్గినవాడు. ఏది మంచో, ఏది చెడో, ఏది సాహిత్యమో, ఏది సాహిత్యం లాంటి వేరొక పదార్థమో ఆయన చెబితేనే వినాలి. కళకు అర్థం అద్భుతంగా చెప్పగలడు. 'అభివృద్ధి' అంటే ఆయనకు స్పష్టమైన అవగాహన ఉంది. అభివృద్ధి నిరోధకులంటే అసహ్యమూ ఉంది.

మనుషుల్ని ప్రేమించగలడు. సమానత నాశించగలడు. సమాజం ఎటు పోతుందో మాత్రమే కాదు, ఎటు పోవాలో కూడా ఆయనకు నిర్దిష్టంగా తెలుసు. తెలుగు సాహిత్యం మీద ఆయనకు ప్రేమాభిమానా లున్నాయి. అవే మమ్మల్ని కలిపాయి. ఆయన కంపెనీ కోసం నేనెంతో ఆరాటపడతాను. 'మెచ్యూర్డ్'గా మాట్లాడే ఆయన లాంటి వాళ్ళు దొరికితే నాకు భోజన పానీయాలక్కర్లేదు. నేను ప్రక్కనుంటే ప్రకాశరావుగారికి గాలి పీల్చుకునే అవసరం లేనట్లు మాట్లాడతారు. గుంటూరు వెళ్ళినప్పుడల్లా ఆయన ఆతిథ్యం సంపూర్ణంగా స్వీకరించి రావటం అలవాటైపోయింది.

ప్రకాశరావుగారీ మధ్యే ఇల్లు కట్టించుకున్నారు. ఎమ్మేప్యాసైన పెద్దమ్మాయి పెళ్ళి కూడా చేసారు. డాక్టరు కిచ్చారుట. యాభై వేలు దాకా కట్నం కూడా కుమ్మరించారట!

వెళ్ళగానే ఈ మాట చెప్పారు ... కేవలం వార్తగా చెప్పారే గాని వాగ్వివాదం కోసం ఆయనెత్తలేదు...నేను మాత్రం...చనువు తీసుకుంటూ

'ఎందుకు కొంటారండీ ప్రకాశరావుగారూ ఇలా వేల వేలు కుమ్మరించి...కరప్షన్ కాదా యిది...ఒక రకంగా యంగ్‌మైండ్స్‌ను మనమే బ్రైబ్ చెయ్యటంలా...మనమే యిలాచేస్తే ఇంకా మనం చెప్పే దెవరికి? ?...' కొంచెం బాధగానే అన్నాను.

ఆయన కూడా తేలిగ్గా తీసుకుంటూ,

'కరెక్ట్—కరెక్ట్...ఏవిటోనోయ్ భాస్కరం... ఇదొక విషస్ సర్కిలైపోయింది. ఈ సమాజంలో ఈ వైరుధ్యాలు తప్పవేమో' అన్నాడు, "ఈ సిగిరెట్ అలవాటు మానలేకపోతున్నాను" అన్నంత తేలిగ్గా.

నాన్‌సెన్స్ అనిపించింది. కూతురు మేడల్లో, కారుల్లో తిరగాలని ఎయిర్ కండిషన్డ్ బోగీ లాంటి అల్లుణ్ణి డెలిబరేట్‌గా కొని సమాజం, వైరుధ్యం అంటున్నాడు. చదువుకున్నాం కనుక తెలివితేటల్తో సమర్థించుకో నవసరం లేదు. 'చేసింది వెధవ పని' అని ఒప్పుకోవటం ఉత్తమం. గట్టిగా ప్రకాశరావుగారితో ఈ ముక్క అంటే ఒప్పుకుంటాడు కూడాను. కాసింత సమాజ వైరుధ్యం అడ్డొచ్చి...మాట మార్చి.. కొత్త ఇంటి వంక చూస్తూ

'ఇల్లు బాగుంది' అన్నాను.

'ఆం. ఏం బాగుందిలే...అసలది కాదోయ్ భాస్కరం... బీదా బిక్కీ అని యిలా కబుర్లు చెబుతామా ... అదేమిటో ఆరుగదుల యిల్లు కట్టించినా యింకా చాలటం లేదు. మేడమీద రూమ్స్ వేయించమని పిల్లలొహటే గోల. మరా గుడిసెల్లో, రోడ్ల ప్రక్క డేరాల్లో ఎలా వుంటున్నారో ఏమిటో ' అర్థం కానంత మిథ్యా విషయం అందులో వున్నట్లు మొహం పెట్టాడాయన. నేనేం మాట్లాడలేదు. పూర్తిగా ఆయన మాటలు వింటే ఉండే తియ్యదనం కోసం వెతుకుతున్నాను.

అవును ఆయన మాటలు తియ్యగానే ఉంటాయి. పరస్పర విరుద్ధంగా ఉండొచ్చు. వికృతంగా ఉండొచ్చు. అర్ధ సత్యాలు కావొచ్చు...'కరెక్టు. కరెక్టు...'అంటూ ఏది కరెక్టో తెలియకుండా చెప్పవచ్చు. ప్రతి విషయాన్ని గుండెల్లోనుండి తోడిచెబుతాడాయన. ఏవైనా పిల్లిమొగ్గ భావాలు కనిపిస్తే అది ప్రకాశరావుగారి హృదయంలో వున్న పొరపాటు కావొచ్చు కాని నాలికలో కనిపించే చీలిక కాదు.

'కరెక్టే' అన్నారు మళ్ళీ ఆయన చిరునవ్వు నవ్వి ... ఏది కరెక్టో ఓ క్షణం నాకు బోధపడలేదు.

'ఇదే సోషలిస్టు కంట్రీలో అయితే చమ్డాలొలవగొట్టి ఈ యింట్లో ఆరు కాపురాలుండమంటారు...హహ్హహ్హ' అని నవ్వారు. నేనూ నవ్వాను. నవ్వుకు శృతిగా కాదు, నవ్వగల్గిన ఆయన శక్తికి ప్రతిగా. నవ్వు లాగింతర్వాత...

'అబ్బెబ్బే ... అప్పుడు మీరు విద్యావేత్తల కేటగిరీలో మళ్ళీ మంచి పొజిషనే కొడతారు...' అన్నాను.

'అవునోయ్...అక్కడా పెద్ద పీట మనకే...'

'తప్పదు కదా మేధావులం...'

ఇద్దరం మరోసారి హాయిగా నవ్వుకున్నాం. వాళ్ళ రెండో అమ్మాయి రైలో స్వీట్సూ, హాట్సూ పట్టుకొచ్చింది. చాలా అందంగా వుంటుంది పిల్ల.

'తెలుసుగా, నంబర్ టూ,' అన్నాడు ప్రకాశరావుగారు.

'తెలియకపోవటమేమిటి' అని ఆ అమ్మాయివంక చూసి, చిరునవ్వుతో పలకరించాను.

'ఇది మాత్రం ఇది ఇయ్యేదు ఇరవై వేలు మింగింది ... ఆ డాక్టర్ సీటు కాదు కాని ఆ సుబ్బారెడ్డిగారు నన్నార్చేసాడు... తీరా సున్నం ఒదిలాక ఆ కాకినాడలో అఘోరించింది...'

'నేనేం చతువుతానన్నా...మీరు నమ్మకండి అంకుల్...నేను బి యస్సీనే చదువుతానన్నాను. మీరూ అమ్మానే పోరిపోరి కాకినాడ పంపించారు...' అంది బుంగమూతి పెట్టా పిల్ల.

'ఐసీ' అన్నానేను. ప్రకాశరావుగారు ఇరకాటం ముహం పెట్టారు.

'ఆ వెధవ బియస్సీలు...చదివేం చేస్తారోయ్... ప్రొఫెషనల్ టచ్‌లేని కోర్సులు ఆడుక్కుతిన్నా...చెప్పు భాస్కరం..'

ఆయన పని చేస్తోంది 'అడుక్కుతినే' కోర్సుల కాలేజీలోనే! టిఫిన్ పెట్టి ఆ అమ్మాయి లోని కెళ్ళింది.

వాళ్ళ మూడో అబ్బాయి, కురచ లాగూ, బనియన్ వేసుకుని టెన్నిస్ బేట్ పట్టుకుని, టెన్నిస్ బంతిలా ఇంట్లోంచి దూసుకు పోయాడు...చాకులా ఉన్నాడు కుర్రాడు.

ప్రకాశరావుగారు అతనివంక విసుగ్గా చూసి

'వెధవ ఇంటర్ జూనియర్ ఏడుస్తున్నాడో లేదో అప్పుడే ప్రియా స్కూటర్ కావాల్ట. రేప్పొద్దున వెనక్కూచోటానికి ఓ ప్రియురాలు కావాలంటాడు...అడుక్కుతిన్నా వీడికి చెప్పవోయ్... కాలేజీ, ఫర్లాంగు దూరం లేదు... అడ్డగాడిదలా గుంటూరు సర్వే చెయ్యటానిక్కాక వీడికెందుకోయ్ వెహికిలూ.'

'పోన్లెండి...ఒక్క కొడుకు గదా కొనండీ' అన్నాను, నేను అనకపోతే అగుతుందా అనుకుంటూ.

'ఆఁ ... కొనాల్సిందే ... నా ప్రాణం తోడేసి నిన్ననే 500 రూపాయలు ఆ విశాఖపట్నం కంపెనీవాడికి కట్టించాడు...'

హఠాత్తుగా నాకో సంశయం కలిగింది ... ప్రకాశరావుగారు జీతంనీదే ఇవన్నీ చేస్తున్నారా...వెనకేమైనా ఆస్తివుంటే కరిగించి తింటున్నారా... తెలుసుకోవాలనిపించింది.

ఆంధ్రపత్రిక

ఆంధ్రపత్రిక ఇప్పటికి ఇంచుమించు ఏడు దశాబ్దాలుగా తెలుగు వారికి సేవ చేస్తోంది.
విజయవాడ మరియు హైదరాబాద్ నుండి వెలువడుచున్నది.
తాజా వార్తలు, పక్షపాతం లేని వ్యాఖ్యలకి ఆంధ్రపత్రిక పెట్టింది పేరు.
ఇవి కాక అన్ని రకాల అభిరుచులనీ సంతృప్తిపరచే ఇతర శీర్షికలు ఎన్నో
మీరు ఆంధ్రపత్రికలో చదవగలరు!

★ మనసినిమాలు
★ డాక్టరు కబుర్లు
★ కలైడోస్కోపు కార్టూన్
★ దినవారఫలాలు
★ మా ఊరి సమస్య
★ శ్రీకృష్ణభాగవతం
★ ఇది నారీదృక్పథం
★ అరణ్యకాండ
★ వింత యదార్థం
★ ఇంకా — వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు ... ...

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో సరికొత్త ఆకర్షణలు ప్రవేశపెడుతూనే ఉంటాము!

వెంటనే ఆంధ్రపత్రిక చందాదారుగా చేరండి! మేనేజరు, ఆంధ్రపత్రిక

'అన్నట్లు గురూగారూ, ఇల్లు ఎంతయిందీ' అన్నాను, సత్యం దానంతటదే వస్తుందని.

'ఎంత కాకేమిటి భాస్కరం ... న ప్రాణాలు తోడేసింది ... సీలింగ్ అయ్యేసరికి నలభై అయిదు వేలు...ప్లాస్టరింగ్ పదివేలు... మొజాయిక్ అయిదూ...ఫ్లష్‌డోర్స్ రెండూ...పెయింట్స్ నాలుగూ ...కాంపౌండ్‌వాల్ ఆరూ నన్ను తినేసిందోయ్. అబ్బ యిల్లు మాత్రం కట్టకూడదోయ్. Only fools build houses అన్నాళ్ళే వాడెవడో ... వెధవదీ లక్ష ఎఫ్. డి. లో పడేస్తే టెన్ పర్సెంట్ యిస్తున్నాడు కదోయ్...'

ఏమో—యిస్తున్నాడేమో...ఇంకా నాకు తెలియలేదు.

అడక్కూడదనుకోండి ... ఇదంతా సేవింగేనా గురూ గారూ...' అన్నాను.

'సేవింగే' అనేసి, ఉలిక్కిపడి కుర్చీలో సరిగ్గా కూచుని

'సేవింగంటే జీతంరాళ్ళ సేవింగనుకునేవ్...ఇంట్లో కాలేజీ తోనే...' తేల్చి చెప్పారాయన.

ఒక క్షణం ఎగాదిగాచూసి 'ప్రయివేట్సా' అన్నాను.

'ఆఁ—మరి...నిజంగా భాస్కరం! ఆ పదేళ్ళూ ... రోజుకు ఆరు గంటలు...ఉదయం మూడు బేచ్‌లూ... సాయంత్రం మూడు బేచ్‌లూ...చెప్పి చెప్పి కాలేజీలో నోరు పెగలక కూర్చుండి పోయే వాణ్ణి. చివరికి నోటి నుండి బ్లడ్‌పడితే ఏ టీ. బీ. నో పట్టుకుం దని చచ్చే భయపడ్డాను ... మా ఆవిడ ప్రయివేట్స్ మానేస్తే గాని వీల్లేదంది ... లక్కీగా రక్తం నేసల్ రప్చర్ అన్నాడన కో డాక్టరు. ఆ పదేళ్ళ రక్త మాంసాల పెట్టుబడి కదూ యిది ..' అని చిలిపిగా నవ్వి ...

'పెట్టుబడి' అనే మాటను మళ్ళీ అని 'ఇలా సోషలైజ్ చేయబడుతూంది' అని పెద్దగా నవ్వారు. నాకు నవ్వు రాలేదు. ఏడుపొచ్చింది.

అన్నీ తెలిసిన ప్రకాశరావుగార్కి తన రక్తమాంసాల 'పెట్టుబడి' ఎవరికోసమో తెలియలేదంటే ... ఎందుకోసమో అర్థం కాలే దంటే...నిజంగా బాధ వేసింది.

నిద్రాహారాలు మాని పిల్లలకు ప్రయివేట్లు చెప్పి, కాలేజీలో గొంతులేక కూర్చుండిపోవటం ...

ఎమ్మే చదివిన పిల్లకు ఎవడ్నో కొనుక్కోవటానికా ... మెడికల్ సీటుకు బేరం పెట్టటానికా...

డబ్బుపెట్టి చదువుకుని, చదువుతో డబ్బుగడించి, డబ్బుతో చదువులు కొనుక్కుని, కొనుక్కున్న చదువు అమ్ముకుని, అమ్ముకున్న డబ్బుతో కొనుక్కుని...ఇదేనా జీవితం!

'నువ్వెన్నన్నా చెప్పోయ్, భాస్కరం...బెర్నార్డ్ షా చెప్పాడుగా ప్రైవేట్ ప్రాపర్టీ ఉన్నంతకాలం నథింగ్ హేపెన్స్ అనీ . ఈస్వంత ఆస్తి పోవాలోయ్' అన్నాడు.

ప్రకాశరావుగారు ప్రకాశరావుగారితోనే మాట్లాడుకుంటున్నారు. నేను వినటంలేదు... నాకు బోర్ కొట్టిందనుకుని, ఆయన నన్ను లేపి పెరట్లో మొక్కలు చూపించటానికి తీసుకువెళ్ళాడు. మధ్యలో ...

'లెఫ్ట్ ఆల్టర్‌నేటివ్ ఈ దేశంలో ఎప్పటికైనా ఏర్పడుతుం దంటావా' అన్నారు.

'డాక్టరు మొగుళ్ళుగాక ఆడపిల్లలు మామూలు మొగుళ్ళతో కాపురంచేసే ఆల్టర్‌నేటివ్ ఏర్పడితో' అందామనుకొన్నాను. ఆయన 'హర్ట్' అవుతాడేమోనని ఆపుకున్నాను.

పెరట్లో ఓ రోజామొక్క ఎక్కణ్ణించి తెప్పించారో చెబుతూ, మధ్యలో 'ప్రపంచ సామ్రాజ్యవాద కేంద్రం ఎక్కడికి మారుతుంద' చెప్పారు. ఇంతలో ...

'కుయ్—కుయ్' మంది వాళ్ళ కుక్కపిల్ల నన్నుచూసి.

'ఛా—పో అవతలికి' అని గెంటేసాడు.

'స్టుపిడ్ మేటింగ్ సీజన్ వచ్చింది కావును ... ఒహటే అరుపు...మేల్ దొరికి చావటం లేదు...' అన్నాడాయన కుక్కపిల్ల బాధ నర్థం చేసుకుంటూ.

'ఈ విప్లవరచయితల్లో మళ్ళీ డివిజన్స్ వచ్చాయట'అన్నారు హఠాత్తుగా ఏదో గుర్తుకొచ్చినట్లు.

'ఆఁ — వచ్చాయి రెండు గ్రూపులుగా విడిపోయారు ..' అన్నాను, కుక్కపిల్లా, అగ్గిపుల్లా.. కాదేదీ సంభాషణ కనర్హం అని సరిపుచ్చుకుంటూ.

'భాస్కరం, ఆ పూలు చూసావా. జూలై ఫ్లవర్స్ అని చాలా డెలైట్‌ఫుల్‌గా ఉంటాయి. వర్షాకాలం తర్వాత పూయటం ప్రారంభిస్తుంది ...'

ఈసారి నేను జోక్ వేద్దామనుకుని ...

'ఇరాన్‌లో ఖొమేనీ లెఫ్టిస్ట్ అంటారా' అన్నాను.

'వెధవ లెఫ్టిస్ట్. వాడేం లెఫ్టిస్టోయ్...రెలిజియస్ క్రూక్... కన్సర్వేటివ్... పాప్యులిస్ట్ అంతే. వాళ్ళ దేశం పెనంమీది నుంచి పొయ్యిలో పడింది. అన్నట్టు, ఆ ఉగాండాలో బఫెలోగాణ్ణి దించేసారు చూశావా ..'

నవ్వుకున్నాం. పూలు చూసి నవ్వుకున్నాం. పకుల్ని చూసి నవ్వుకున్నాం. ప్రజల్నీ, దేశాల్నీ చూసి నవ్వుకున్నాం. చక్కని సాయంత్రం చల్లనిగాల్లో హాయిగా ఇద్దరం ప్రపంచాన్ని సమీక్షించుకున్నాం. గాలీ,పిట్టా,వెల్తురూ మమ్మల్నెలా సమీక్షించుకున్నాయో తెలీదు.

*　　*　　*

సాయంత్రం ఏడు దాటింతర్వాత 'శిఖరాగ్ర' సమావేశానికి ఇద్దరం ఆయన గదిలో కూర్చున్నాం .. ఎదురుగా టీపాయ్ మీద గ్లాసులూ, పదార్థాలూ ..

మామూలుగా మొదటి గ్లాసు కిరసనాయిల్లా వుంది. రెండోది మంచినీళ్ళలాదిగిపోయింది. మూడోది అమృతంలా గోచరించింది. శరీరానికి అమరత్వం మెల్లమెల్లగా సిద్ధిస్తూంది.

ఇంట్లో ఏదో చిన్న అలికిడి...

ఇద్దరం సాహిత్యం చర్చించుకుంటున్నాం .. ఇలియట్, శ్రీశ్రీ, దోస్తొవిస్కీ, కృష్ణశాస్త్రి...వచ్చిపోతున్నారు...గుడిపాటి వెంకటచలం గుర్తొస్తున్నాడు... ఏది ఏమైనా కవిత్వానికి ప్రేరణ పెద్దన్నగారి పద్యమేనని ఓ తీర్మానం ... మార్క్సుకీ ఫ్రాయిడ్ కీ నివాళు లర్పిస్తూ మరో తీర్మానం ... తిలక్ చెప్పిన ''భూమధ్య రేఖ'' మీద నిలబడి ఇలా తీర్మానాలు చేసుకుంటుండగా ...

ఇంట్లో అలజడి పెద్దదైంది. వాళ్ళావిడ గొంతు పెంచి కేకలేస్తోంది ఎవరిమీదనో...!

ఇక్కడ రసాయనం నరాల్లోకి ప్రవేశిస్తూంది...కళాభిరుచిని కొరడాల్తో కొట్టి నిప్పులాంటి నిజాల్ని కక్కిస్తోంది. చుట్టూ ఉన్న ఉపాహారాలు తింటున్నాం.

ఇంట్లో తగాదా పెరిగిపోతోంది ... వాళ్ళావిడా, మరో ఆడ గొంతూ ...

గ్లాసు క్రిందపెట్టి చిరాగ్గా లోనికెళ్ళారు ప్రకాశరావుగారు. మూడ్ సరిగా లేదు. వాళ్ళావిడనేమైనా అంటాడేమో నని భయ పడ్డాను.

తగాదా సాగుతూ, రేగుతూనే వుంది ... పదిహేను నిమిషాల తర్వాత కళ్ళు మరి కాస్త ఎర్ర చేసుకుని తిరిగొచ్చారు. వస్తూనే 'టేకిట్ భాస్కరం ... ఇంకోటి తీసుకో ప్లీజ్' అంటూనే 'వెధవ న్యూసెన్సు' అన్నారు. ఆ రెండో విశేషణం గొడవ గురించి!

'ఒద్దుగానండి...గొడవేమిటి ?' అన్నాను.

'తగాదా ఏముంది .. సిల్లీ థింగ్ ... సర్వెంట్ మైడ్ ... జీతం పెంచమంటుంది.'

'ఎంతటా ?'

'మళ్ళీ రూపాయి పెంచాలట...మూణ్ణెల్లక్రితమే పదికాదని పదకొండుచేసాం.. ఇప్పుడు పన్నెండంటుంది' సీరియస్సయిపోయారు ప్రకాశరావుగారు.

'దట్సాల్ రైట్...నీ మూడ్ పాడుచేసానో ఏమిటో .. వన్ మోర్ ... ఇంకోటి తీసుకో...డియర్.. ప్లీజ్...వన్ మోర్...' బల వంత పెడుతున్నాడు...తను ...

ప్రతిదానికీ విలువుంటుంది. 'వన్ మోర్' పెగ్ విలువ నాలుగు రూపాయిల్దాకా వుంటుంది.

పదకొండుకూ ... పన్నెండుకూ మధ్య వన్ మోర్ రూపీ ఉంటుంది !

చుట్టం చూపుగా వచ్చిన భాస్కరానికీ...గొంతులో కుక్కుతున్న వన్ మోర్ కీ...వన్ మోర్ రూపీకీ తేడా వుంటుంది.

'ఆఫ్ హ్యూమన్ బాండేజ్'లో మనిషికీ మనిషికీ ఏదో తేడా వుంటుంది...ఒక్క మనిషిలోనే రెండు బాండేజ్ స్ చూడలేనంతగా మత్తు ఎన్ని పెగ్గులు తీసుకున్నా రాదు.

అసలు మేధావులకు మత్తు అంత తొందరగారాదు...వచ్చిం దనుకోవటం తప్పు!!

అనుభూతికి యేతం

శ్రీ కె. అంజయ్య

రాత్రిని చప్పరిస్తూనే
  రెండు గంటల్నీ ఖూనీ చేశాం.
జ్ఞానాన్ని దేవుకోవాలని
దాని ''దరి'' అందుకోవాలని
తపనలో తాపంలో
శబ్దాల్ని మెదడ్లో రుబ్బుతూ
పీల్పు విడుపు ప్రక్రియలో
చీకటిని చప్పరించేసి బాగాలేదని తేల్చి
దీపంలో నింపుకున్న కిరణాల్ని ఒంపుకుంటూ
అనుభూతుల్ని నెమరేయడం.
ఆలోచనల్ని సాకి పదునుపెట్టడం.
ఆవేశాన్ని కాంతివేగంలో పొదివి
అక్షరాల్ని కాగితంపై అద్దడం.
తదుపరి మామూలుగా విశ్రాంతి.
మామూలుగానే తెల్లవారడము.